ఓటమెరుగని గంగుల



23 ఏండ్లలో వరుస విజయాలు

- కరీంనగర్ నియోజకవర్గం నుంచి తిరుగులేని నేతగా ఎదిగిన గంగుల కమలాకర్
- మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం
- తాజాగా నాలుగోసారి గెలిచిన మొదటి ఎమ్మెల్యేగా రికార్డు
- ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల నిరాధార ఆరోపణలు
- అక్కున చేర్చుకొని ఆశీర్వదించిన ప్రజలు
- ప్రతిపక్షాలకు చెంపపెట్టులా తీర్పు
- పనితీరే అండగా నిలుస్తున్నదన్న విశ్లేషకులు

కరీంనగర్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజకీయ జీవితంలో గెలుపోటములు సహజం. కానీ, గంగుల కమలాకర్ రాజకీయ చరిత్రలో మాత్రం అటువంటివి కనిపించవు. 23 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో కౌన్సిలర్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి ఎన్నికల్లోనూ విజయాన్ని సాధిస్తూ వచ్చారు. రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేసిన తర్వాత వ్యాపారాన్ని పక్కన పెట్టిన ఆయన, ప్రజాసేవలోనే మునిగి తేలుతున్నారు. నిత్యం ప్రజల్లో ఉండడం, వారితో మమేకం కావడం, ‘అన్నా అంటే నేనున్నా’ అనే భరోసా ఇవ్వడం, సమస్య ఏదైనా సరే ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించడం, అభివృద్ధిని పరుగులు పెట్టించడం ఆయన నైజం. ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉండడమే కాదు, పార్టీలకు అతీతంగా ఎవరు ఏ సమయంలో ఫోన్ చేసినా.. రిసీవ్ చేసుకొని అవతలి వ్యక్తి సమస్యను విని పరిష్కరించడంలో ఆయనకు ఆయనే సాటి. వ్యాపార రంగం నుంచి రాజకీయ రంగంలోకి వచ్చినా.. కౌన్సిలర్ నుంచే ఆయన ప్రజల అభిమానం చూరగొంటూ వస్తున్నారు. ప్రతి ఎన్నికలోనూ ప్రజల ఆశీర్వాదంతో ఓటమి ఎరుగని నాయకుడిగా ప్రయాణం సాగిస్తున్నారు. కరీంనగర్ ఇందిరానగర్ నుంచి మొదటిసారిగా 2000 సంవత్సరంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించి, తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత 2005లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికల్లో 14వ డివిజన్ నుంచి పోటీ చేసి కార్పొరేటర్‌గా విజయం సాధించడమే కాదు, టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా సాధించిన విజయాలు, ప్రజలకు అందించిన సేవలు అతన్ని శాసనసభవైపు ప్రోత్సహించాయి. వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేను చేశాయి.

కరీంనగర్ గడ్డపై రికార్డు

కరీంనగర్ నియోజకవర్గ గడ్డపై గంగుల కమలాకర్ రికార్డు సృష్టించారు. ఈ నియోజకవర్గం ఏర్పడిన 1952 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు గెలిచిన వారు ఎవరూ లేరు. స్వర్గీయ జువ్వాడి చొక్కారావు కాంగ్రెస్ అభ్యర్థిగా 1957లో విజయం సాధించారు. ఆ తదుపరి 1962లో జరిగిన ఎన్నికల్లో కిషన్‌రెడ్డి వేరే పార్టీ నుంచి గెలిచారు. తిరిగి 1967,1972లో జరిగిన ఎన్నికల్లో వరుసగా చొక్కారావు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. ఆ లెక్కన చూస్తే ఆయన మూడుసార్లు విజయం అందుకున్నా రు. వరుసగా గెలిచింది మాత్రం రెండు సార్లే. కానీ, గంగుల కమలాకర్ మాత్రం వరుసగా నాలుగు సార్లు గెలిచి తొలి ఎమ్మెల్యేగా చరిత్ర సృష్టించారు. 2018 ఎన్నికల్లోనే హ్యాట్రిక్ సాధించి, వరుసగా మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సొంతం చేసుకున్నారు. మొదటిసారి 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి 30,450 ఓట్ల మెజార్టీతో గెలిచిన గంగుల, అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీని వీడి 2012లో గులాబీ పార్టీలో చేరారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 24,750 ఓట్ల మెజార్టీతో రెండోసారి గెలిచారు. 2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో 14,976 ఓట్ల మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధించి కరీంనగర్ నియోజకవర్గ చరిత్రలోనే రికార్డు సృష్టించారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై 3,163 ఓట్ల మెజార్టీతోవిజయం సాధించి, నాలుగోసారి ఈ గడ్డపై నుంచి గెలిచిన తొలి ఎమ్మెల్యేగా చరిత్ర నెలకొల్పారు.

పనితీరుకు పట్టం

నిజానికి ఈ ఎన్నికల్లో కమలాకర్‌ను ఓడించడానికి ప్రతిపక్షాలు అంతర్గతంగా ఒక్కతాటిపైకి వచ్చాయి. సోషల్ మీడియా వేదికగా నిరాధారమైన ఆరోపణలు చేశాయి. భూములు కబ్జా చేశారని, అక్రమ గ్రానైట్ వ్యాపారం చేశారని, వక్ఫ్‌భూములు కబ్జా చేశారంటూ విష ప్రచారం చేశాయి. ఇలా ఎలాగైనా ఓడించేందుకు సర్వశక్తులూ ఒడ్డాయి. అయినా ప్రజలు ప్రతిపక్షాల మాయమాటలను విశ్వసించలేదు. గంగుల చేసిన అభివృద్ధితోపాటు నిరంతరం అందుబాటులో ఉండే వ్యక్తిగా కమలాకర్‌ను ప్రజలు గుర్తించి, మరోసారి పట్టం కట్టారు. నిజానికి ఉమ్మడి జిల్లాలో హుస్నాబాద్‌ను కలుపుకొని 13 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే, అందులో ఓటర్ల పరంగా చూస్తే అతి పెద్ద నియోజకవర్గం కరీంనగరే. ఈ నియోజకవర్గంలో 3,55,054 ఓట్లున్నాయి. ఏ నియోజకవర్గంలోనూ ఇన్ని లేవు. అందులో పోస్టల్ బ్యాలెట్ కలుపుకొని మొత్తం 2, 29,774 ఓట్లు పోలయ్యాయి. గంగులకు 92,179 (40.12) ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు 89,016(38.74) ఓట్లు వచ్చాయి. మొత్తంగా అతి పెద్ద నియోజకర్గం కావడం, అందులోనూ నగర ఓటర్లే మెజార్టీశాతం ఉన్న ఈగడ్డపై నాలుగుసార్లు విజయం సాధించడం అంతా ఆషామాషీ కాదని విశ్లేషకులు చెబుతున్నారు. పనితీరే గంగుల విజయాలకు అండగా నిలుస్తున్నదని స్పష్టం చేస్తున్నారు.

విజయావకాశాలున్నా..

మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే వేములవాడ నియోజకవర్గం పరిస్థితి వేరు. నిజానికి గత చరిత్ర చూస్తే.. ఆది నుంచి ఇది పూర్తిగా గులాబీ పార్టీకి అండగా నిలిచింది. ఈ నేపథ్యంలో వేములవాడ బీఆర్ఎస్‌కు అడ్డగా పేరు పడింది. ఈ సారి చల్మెడ లక్ష్మీనరసింహారావును పార్టీ రంగంలోకి దింపింది. మంచి విజన్ ఉన్న నాయకుడు కావడంతో అభ్యర్థిగా ప్రకటించింది. ఇదే సమయంలో రమేశ్‌బాబుకు టికెట్ ఇవ్వకపోవడానికి గల కారణాలను స్వయంగా పార్టీ అధినేత కేసీఆరే స్వయంగా విప్పి చెప్పారు. చల్మెడ తన సొంత నియోజకవర్గం కావడంతో చాలా కాలంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన కళాశాల నుంచి అనేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ వచ్చారు. అంతేకాదు, చాలా మందికి వివిధ రకాల శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. సొంత గ్రామం మల్కపేటలో కోట్లాది రూపాయలతో ఐటి నిర్మించడంతోపాటు గుడిని కూడా కట్టిస్తున్నారు. అనేక రకాల స్వచ్ఛంద కార్యక్రమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో వేములవాడ గడ్డపై గులాబీకి ఉన్న బలం, అలాగే చల్మెడ చేసిన సేవలు, ఆయనకున్న విజన్ వంటివి ఎన్నో విజయం చేకూరుస్తాయని అందరూ భావించారు. టికెట్ ప్రకటన వచ్చిన వెంటనే చల్మెడ సైతం అందరినీ కలుపుకొని ముందుకెళ్లారు. తనదైన శైలిలో ప్రచారం సాగించారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబుతోపాటు ఇన్‌చార్జిగా వ్యవహరించిన బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. అంతేకాదు, స్వయంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఈ నియోజకవర్గంలో పర్యటించి, చల్మెడను గెలిపిస్తే దత్తత తీసుకొని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లమని హామీ ఇచ్చారు. వేములవాడలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలోనూ పార్టీ అధినేత కేసీఆర్ సైతం పలు హామీలు ఇచ్చారు. పరిస్థితులను ఏ కోణంలో చూసినా గెలుపు తథ్యం అని అందరూ భావించారు. కానీ, రిజల్ట్ మాత్రం అందుకు భిన్నంగా వచ్చింది.

పోరాడి ఓడిన చల్మెడ

- రాజన్న గడ్డపై బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనరసింహారావు రాజీలేని పోరు
- అన్ని వర్గాలనూ కలుపుకొని ప్రచారం
- అభ్యర్థి కొత్తే అయినా ప్రజల నుంచి ఆదరణ
- గెలిచేందుకు ఎన్నో అవకాశాలు
- సొంత పార్టీలోనే వెన్నుపోటు?
- ఫలితంగానే ఓటమి అంటున్న గులాబీ శ్రేణులు

కరీంనగర్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భారత రాష్ట్ర సమితి కంచుకోటలా ఉన్న వేములవాడ నియోజకవర్గంలో విజ్ఞానవంతుడైన చల్మెడ లక్ష్మీనరసింహారావు ఓటమికి గల కారణాలపై ఆ పార్టీలో చర్చ సాగుతున్నది. నిజానికి ఫలితాలను విశ్లేషిస్తే.. ఇక్కడ కేవలం సెంటిమెంట్ తప్ప కాంగ్రెస్ గాలి పనిచేయలేదు. ఈ సెంటిమెంట్‌ను తట్టుకొని ముందుకు పోవడం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద కష్టమేమీ కాదు. అలాగే, భారతీయ జనతా పార్టీ తన గెలుపు కోసం కాకుండా కేవలం బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా పనిచేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చివరి నిమిషంలో తుల ఉమకు ఇచ్చిన బీఫాంను చెన్నమనేని వికాస్‌కు అందించారన్న ఆరోపణలున్నాయి. వీటిన్నింటినీ అధిగమించి విజయం వైపు నడిచే శక్తి బీఆర్ఎస్‌కు ఉన్నా.. సొంత పార్టీలోని కొందరు వెన్నుపోటు పొడవడం వల్లే ఓటమి పాలైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నియోజకవర్గం.. బీఆర్ఎస్ గడ్డ

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో వేములవాడ శాసనసభా నియోజకవర్గం ఏర్పడింది. ఆనాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్‌కు పెట్టని కోటగా ఉన్నది. ఈ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికను కలుపుకొని మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు నాలుగుసార్లు విజయం సాధించారు. 2009 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆయన, అప్పుడు జరిగిన ఎన్నికల్లో టీడీపీ, టీఆర్ఎస్ పొత్తులో భాగంగా టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. తన సమీప ప్రత్యర్థిపై 1821 ఓట్లతో విజయం సాధించారు. 2009లో తె లంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన యూపీఏ ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడం, ఇదే సమయంలో చంద్రబాబు అనుసరించిన రెండు కళ్ల సిద్ధాంతాన్ని నిరసిస్తూ రమేశ్‌బాబు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. 2010లో ఉప ఎన్నికలు రాగా టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగి, 50వేల పైచిలుకు మెజార్టీతో గెలిచారు. తిరిగి 2014 ఎన్నికల్లో 5,268 ఓట్లతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 28,186 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇలా ప్రతి ఎన్నికలోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలిచారు. రమేశ్‌బాబుకు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పట్టంకట్టారు. అయితే తాజా, ఎన్నికల్లో కోర్టులో ఉన్న ఒక కేసును దృష్టిలో పెట్టుకొని రమేశ్‌బాబుకు టికెట్ ఇవ్వడం లేదని అధినేత కేసీఆరే స్వయంగా ప్రకటించారు. మంచి వ్యక్తిత్వంతోపాటు విద్యావంతుడైన చల్మెడ లక్ష్మీనరసింహారావుకు అవకాశమిచ్చారు.

వెన్నుపోటే కారణమా..?

ఈ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కలిపి మొత్తం 1,74,145 ఓట్లు పోలయ్యాయి. అందులో విజయం సాధించిన ఆది శ్రీనివాస్‌కు 71,451 (41.03 శాతం), చల్మెడ లక్ష్మీనరసింహారావుకు 56,870(32.66 శాతం), బీజేపీ అభ్యర్థి వికాస్‌కు 29,710 (17.06 శాతం) ఓట్లు వచ్చాయి. చల్మెడపై 14,581 ఓట్ల మెజార్టీతో ఆది శ్రీనివాస్ విజయం సాధించారు. నిజానికి ఈ ఓట్లు సాధించడం బీఆర్ఎస్‌కు పెద్ద కష్టమేమీ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే లోపం ఎక్కడ జరిగిందన్న దానిపైనే ఇప్పుడు చర్చ నడుస్తున్నది. బీఆర్ఎస్ అని చెప్పుకుంటూనే.. కొంత మంది నాయకులు సరైన రీతిలో ప్రచారం చేయకపోవడంతోపాటు నెగెటివ్ ప్రచారం చేయడం, అలాగే వెన్నంటి ఉన్నట్టే ఉండి.. వెన్నుపోటు పొడవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రచారం చేసే వారిని సైతం కొంత మంది అంతర్గతంగా అడ్డుకున్నారన్న విమర్శలూ ఉన్నాయి. నిజానికి వచ్చిన మెజార్టీని చూస్తే.. కాంగ్రెస్ గాలి ఇక్కడ పెద్దగా లేదు. ఒక్క సెంటిమెంట్ కొంత మేరకు పని చేసిందని చెప్పవచ్చు. ఇక బీజేపీ సైతం చల్మెడను ఓడించడమే లక్ష్యంగా కంకణం కట్టుకొని ప్రచారం చేసిందన్న విమర్శలున్నాయి. అందులో భాగమే తుల ఉమకు ఇచ్చిన బీఫాంను చివరి నిమిషంలో మార్చి వికాస్‌కు ఇచ్చారన్న ఆరోపణలు వచ్చాయి. అయితే, ప్రభుత్వాల కుట్రలను, కుతంత్రాలను తట్టుకొని సైతం బీఆర్ఎస్ విజయం దిశగా అడుగులు వేసే సామర్థ్యం ఈ గడ్డపై ఉన్నది. ఇతర పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా.. అందరూ నిస్పార్థంగా పనిచేసి ఉంటే విజయం సాధించే అవకాశం ఉండేదన్న వాదన ప్రస్తుతం గులాబీ పార్టీలో నడుస్తున్నది. ఒక వైపు బీఆర్ఎస్ బలం.. మరోవైపు ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు.. ఇంకోవైపు అభ్యర్థి చల్మెడపై ఎటువంటి ఆరోపణలూ లేకపోవడంతోపాటు విజన్ ఉన్న నాయకుడు కావడం వంటి అంశాలు కలిసి వచ్చేవిగా ఉన్నా.. రిజల్ట్ మాత్రం మరోరకంగా ఉండడం చూస్తే పార్టీలో కొంత మంది వెన్నంటి ఉంటానే వెన్నుపోటు పొడిచారనే విమర్శలు వినవస్తున్నాయి.

ప్రజల మనసు గెలిచిన ‘పాడి’

- హుజూరాబాద్ ఎమ్మెల్యేగా జయకేతనం
- ప్రత్యర్థుల ఎత్తులు చిత్తు చేస్తూ ముందుకు
- ఆది నుంచీ జనంతో మమేకం
- ఆదరించిన నియోజకవర్గ ప్రజానీకం
- ఈటలకు చెక్‌పెట్టి కౌశిక్‌రెడ్డికే పట్టం

నంబురాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఎత్తుకున్న జీఆర్ఎస్ కార్యకర్తలు

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 5 : హుజూరాబాద్ నియోజవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 2,49,558 ఓట్లు ఉండగా, అందులో 2,09,311 ఓట్లు పోలయ్యాయి. పాడి కౌశిక్‌రెడ్డికి 80,333 ఓట్లు, ఈటల రాజేందర్‌కు 63,460 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్‌కు 53,164 ఓట్లు దక్కాయి. అయితే పాడి మొదటి రౌండ్ నుంచే వేల ఓట్లు ఆధిక్యత కనబరిచారు. చివరి 19 రౌండ్ల దాకా మెజార్టీ సాధిస్తూ వచ్చారు. దీనిని ఎవరూ ఊహించలేదు. కొన్ని రోజులుగా ‘నువ్వా నేనా’ అంటూ ప్రచారం సాగగా, కౌశిక్‌రెడ్డే విజయం సాధించారు. అందుకు చాలా కారణాలున్నాయి. తాను ఎమ్మెల్సీ పదవిలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కావడం తన ఆశయమని, ఎమ్మెల్యే అయితే ఇంకా ఎక్కువ సేవ చేయవచ్చని చెప్పి ప్రజల మనసు గెలిచారు. అంతేకాదు, టికెట్ రాక ముందు నుంచే నియోజకవర్గవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు కింటిస్థాయి కార్యకర్తలతో మమేకమయ్యారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డితోపాటు స్థానిక నాయకులందరినీ కలుపుకొని వెళ్తూ ప్రచారం చేశారు. తన భార్య శాలినీరెడ్డి, కూతురు శ్రీనికారెడ్డి కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అన్ని వర్గాలకూ చేరువై పాడి విజయం సాధించారు.

ఈటలకు గట్టిదెబ్బ

‘నా హుజూరాబాద్’ అంటూ పదే పదే గొప్పలు చెప్పిన ఈటల, ఈ సారి బొక్కబోర్లా పడ్డారు. ఎక్కడికి వెళ్లినా హుజూరాబాద్ నాకు కన్న తల్లిలాంటిదని, ఇక్కడి ప్రజల రుణం తీర్చుకోలేనిదని చెప్పే ఆయన, తీరా ఇక్కడ ప్రజలను విస్మరించారు. ఉప ఎన్నికలో గెలిచిన తర్వాత మొత్తంగా పత్తా లేకుండా పోయారు. తాజా ఎన్నికల్లో హుజూరాబాద్‌లో పాడి కౌశిక్‌రెడ్డి, గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ చేశారు. కానీ, రెంటికీ చెడ్డ రేవడిలా ఒక్క చోట కూడా గెలువలేకపోయారు. కర్ణుడి చావుకి కారణాలెన్నో అన్నట్లుగా ఈటల ఓటమికి ఆయన అహంం, ఒంటిద్దు పోకడనే కారణమని ప్రజలు చెప్పుకొంటున్నారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అతి విశ్వాసమే ఆయన కొంపముంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో పాడి కౌశిక్ రెడ్డి ప్రజల మనసు గెలిచి, జయకేతనం ఎగరవేశారని చెబుతున్నారు.

తుఫాన్.. వణుకు

సిరిసిల్లలో స్వెట్టర్ వేసుకొని స్కూల్‌కి వెళ్తున్న విద్యార్థి

- ఉమ్మడి జిల్లాలో మిగ్‌జాం ప్రభావం
- రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు
- అక్కడక్కడా వర్షాలు.. రోజంతా చల్లని గాలులు
- పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న జిల్లావాసులు

కరీంనగర్ రూరల్: నగునూర్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై పరదాలను కప్పిన రైతులు

సిరిసిల్లలో వర్షంలో తడవకుండా గొడుగు పట్టుకొని బైక్‌పై వెళ్తున్న వాహనదారులు

సిరిసిల్లలో స్వెట్టర్లు వేసుకొని స్కూల్‌కి వెళ్తున్న విద్యార్థులు

కరీంనగర్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : మిగ్‌జాం తుఫాన్ కారణంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. రెండు రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకు అంతంత మాత్రంగానే ఉన్న చలి తీవ్రత పెరిగింది. మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు 26కు పడిపోయాయి. వర్షానికి తోడు ఈదురు గాలులు వీస్తున్నాయి. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నది. సోమవారం రాత్రి నుంచే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చలి తీవ్రత మరింత ఎక్కువైంది. మూడు నాలుగు రోజుల కిందటి వరకు పగటి ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీలు నమోదవగా సోమవారం నుంచి పడిపోతున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోవడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ ఏడాది శీతా కాలంలో అక్టోబర్, నవంబర్‌లో చలి తీవ్రత అంతగా కనిపించలేదు. మిగ్‌జాం తుఫాన్ ప్రభావం కారణంగా ఈ ఏడాది మొదటిసారిగా ఇంతగా చలి పెడుతోంది. ఉత్తరాది నుంచి శీతల పవనాలు వీస్తున్న కారణంగా ఈ చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తుఫాన్ ప్రభావం తగ్గినా చలి తీవ్రత కొనసాగవచ్చని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

పంటలకు ముప్పు ఉండదు..

మారిన వాతావరణ పరిస్థితులు యాసంగి పంటల సాగుకు ఎలాంటి నష్టం కలిగించకపోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో రైతులు ఇంకా వరినార్లు పోస్తున్నారు. మక్క, పల్లి, తదితర ఆరుతడి పంటలకు ఈ వాతావరణం వల్ల ఎలాంటి నష్టమూ ఉండదని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. మరో రెండు మూడు రోజులు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటాయని చెబుతున్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం తగ్గితే వర్షాలు తగ్గే అవకాశం ఉంటుందని, ఈ వర్షాల వల్ల చలి తీవ్రత పెరగడమే గానీ, పంటలకు ఎలాంటి ముప్పూ ఉండదని అంటున్నారు.

జాతీయ ఉత్తమ రైతుగా ఆర్సీ రెడ్డి

- వినూత్న పంటల సాగులో ఆదర్శంగా గోపాల్‌రావుపేట రైతు
- జమ్మికుంట కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ప్రోత్సాహంతో సేద్యం ● సాంకేతిక సాగుతో అధిక లాభాలు ● ఈ నెల 8న అవార్డు అందించనున్న ఏసీఏఆర్, కృషి జాగరణ్

జాతీయ ఉత్తమ రైతుగా ఎంపికైన డ్యావ రామచంద్రారెడ్డితో కేవీకే శాస్త్రవేత్త జి వేణుగోపాల్

జమ్మికుంట, డిసెంబర్ 5 : రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటకు చెందిన ఆదర్శ రైతు డ్యావ రామచంద్రారెడ్డిని జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతు అవార్డు వరించింది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కృషి జాగరణ్ సంయుక్తంగా ఏటా ‘మిలీనియం ఫార్మర్స్ మీట్’లో ఉత్తమ రైతులకు అవార్డులను అందిస్తున్నది. అందులో భాగంగా మిలీనియం ఫార్మర్స్ మీట్-2023 పేరిట ఈ నెల 5 నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలో జాతీయ మేళా జరుగనున్నది. కాగా, మిలీనియం మీట్ అవార్డుకు తెలంగాణ నుంచి నలుగురు రైతులు ఎంపికయ్యారు. అందులో జమ్మికుంట కేవీకే ఫార్మర్ ఆర్సీ రెడ్డి కూడా ఉన్నారు. రామచంద్రారెడ్డి గత 25 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నారు. సాగులో కొత్తగా వచ్చే మార్పులను అవగాహన చేసుకుని ముందుకు సాగుతున్నారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త వేణుగోపాల్ ప్రోత్సాహం, సలహాలు, సూచనలతో బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, మస్క్ మిలన్, లిచి, ఉష్ణ ఆపిల్, వరి తదితర పంటలు సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో తీవ్ర మార్పులకు తట్టుకొని నిలబడే విధంగా పంటలు సాగు చేస్తున్నారు. ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తన పంట దిగుబడులను ఏరీస్ రెడ్డి బ్రాండుతో అమ్మకాలు చేస్తున్నారు. రామచంద్రారెడ్డి సాగు, మార్కెటింగ్, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్న సంస్థ జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేయగా, ఈ నెల 8న నర్సాపూకుల చేతుల మీదుగా జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతుగా అవార్డు అందుకోనున్నారు. ఏరీస్ రెడ్డికి అవార్డు రావడం పట్ల జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్త జి వేణుగోపాల్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.